ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

గురువారం 26 డిసెంబరు 2024



బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరిన ఆడారి ఆనంద్‌కుమార్

విశాఖ డెయిరీ చైర్మన్ బీజేపీలో చేరిక

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, ఆయన సోదరి, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి బుధవారం రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. - వార్త మెయిన్ ఎడిషన్‌లో..

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

జిల్లాలో క్రిస్మస్ వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా మంగళవారం రాత్రి అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పండుగ సందర్భంగా చర్చిలను అందంగా అలంకరించారు. క్రీస్తు రాకడను స్వాగతిస్తూ క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. బుధవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. - చోడవరం/ఆంధ్రజ్యోతి



చోడవరంలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

సహకార పదవులకు పోటీ

DCCB

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి పదవి రేస్‌లో టీడీపీ నుంచి లాలం భవాని, గవిరెడ్డి రామానాయుడు, కోట్ని బాలాజీ, కిలపర్తి భాస్కరరావు

- మరికొందరు కూడా యత్నం
- ప్రాథమిక సహకార సంఘాలకు త్వరలో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు...జాబితాల తయారీలో ఎమ్మెల్యేలు



లాలం భవాని



గవిరెడ్డి రామానాయుడు



కోట్ని బాలాజీ



కిలపర్తి భాస్కరరావు

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): **సహకార శాఖ పరిధిలో గల డీసీసీబీ, డీసీఎంఎస్‌లతోపాటు ప్రాథమిక సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జుల నియామకంపై ప్రభుత్వం దృష్టిసారించింది. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున అప్పటివరకూ నామినేటెడ్ పాలక వర్గాలను ఏర్పాటుచేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి సంకేతాలు రావడంతో కూటమి పార్టీల నేతల్లో పదవుల కోసం పోటీ నెలకొంది.**

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెట్ సొసైటీ (డీసీఎంఎస్) పర్సన్ ఇన్‌చార్జి పదవులకు తెలుగుదేశం నుంచి పలువురు పోటీ పడుతున్నారు. ప్రస్తుతానికి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, అనకాపల్లికి చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు రేస్‌లో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల నగరానికి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడును లాలం భవాని కలిసి డీసీసీబీ చైర్మన్ పర్సన్ ఇన్‌చార్జి పదవి ఇవ్వాలని కోరారు. ఈ విషయమై ఆమె ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు, ఇతర పెద్దలను కలిశారు. భవానీ ఎలమంచిలి నియోజక వర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు లాలం భాస్కరరావు సతీమణి. గతంలో ఆమెకు జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారు. ఎన్నికలకు కొద్ది నెలల ముందు భాస్కరరావు కన్నుమూశారు. ఇక, మాడుగుల మాజీ ఎమ్మెల్యే రామానాయుడు కూడా డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి రేస్‌లో ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేశానని, ఆ సమయంలో తనకు నామినేటెడ్ పదవి ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆయన జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలను కలిశారు. తన పేరు పరిశీలించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తిచేశారు. ఎన్నికల ... మిగతా 6వ పేజీలో

ఐటీ అభివృద్ధికి ఊతం

- విశాఖలో ఎస్‌టీపీఐ ఇంక్యుబేషన్ సెంటర్ నిర్మాణానికి శ్రీకారం - 6లో

వదలని వాన

రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడి

- కోసిన వరి పనలు పాడైపోతాయేమోనని రైతుల్లో టెన్షన్
- గత మూడు రోజులుగా ముసురు వాతావరణంతో ఇబ్బందులు



జల్లూరులో నేలకొరిగిన వరి పంట నుంచి మొలకలు వస్తున్న దృశ్యం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది.

వ్యవసాయాధికారుల సూచనల మేరకు గత కొద్ది రోజులుగా వరి కోతల పనులను రైతులు వాయిదా ... మిగతా 6వ పేజీలో



అనకాపల్లి మండలంలో వరి కోతలు కోసి కుప్పలు వేసుకుంటున్న రైతులు

నేలకొరిగి.. మొలకలొస్తూ..

కోటవురట్ల: మండలంలోని జల్లూరు, కైలాసపట్నం, కోటవురట్ల, కైలాసపట్నం గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు వరి చేలు నీళ్లలో నానుతున్నాయి. దీనికి తోడు ఈదురుగాలులకు వరి చేలు నేలకొరిగి మొలకలు వస్తున్నాయి. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించి వరి పంట బాగా పడిందని, తీరా వరి పంట చేతికి అంది వచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండడంతో నష్టపోవలసి వస్తుందేమోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వరి పనలు వర్షార్పణం

- మూడు రోజులుగా తడుస్తుండడంతో రైతుల్లో గుబులు



మూడు రోజులుగా జిల్లాలోని నాతవరంలోని పొలంలో తడుస్తున్న వరి పనలు

నాతవరం: తీవ్ర అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా మండలంలో మోస్తరు వర్షాలు కురుస్తుండగా పొలంలో కోసి ఉంచిన వరి పనలు తడుస్తుండడంతో ధాన్యం రంగు మారుతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల క్రితం రైతులు చాలా చోట్ల వరి కోతలు కోసి ఉంచారు. వారం తరువాత వరి పనలు ఆరిన తరువాత వరి కుప్పలు పెట్టుకుందామనుకున్న సమయంలో మూడు రోజుల నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో పొలంలో కోసి ఉంచిన పనలు తడిసిపోవడంతో ధాన్యం రంగుమారి సరైన ధర రాదని రైతులు కలత చెందుతున్నారు. ఈదురు గాలులకు ఇంకా కోత కోయకుండా ఉన్న వరి చేలు నేలకొరుగుతున్నాయని వాపోతున్నారు.

రియల్టర్ బరితెగింపు

పంచాయతీకి చెందిన రక్షణ గోడ కూలదోసి లేఅవుట్‌కు దారి

- రాత్రికి రాత్రే పనులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- రియల్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



ప్రహరీని కూల్చివేసి తమ స్థలంలోకి రియల్టర్ రహదారిని ఏర్పాటు చేసుకున్న దృశ్యం

పరవాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): **మండల కేంద్రం పరవాడలో ఓ రియల్టర్ బరితెగించాడు. ఏకంగా పంచాయతీకి చెందిన రక్షణగోడను ఎక్స్‌కవేటర్ సాయంతో రాత్రికి రాత్రే కూలదోయించి తన లేఅవుట్‌కు రహదారిని ఏర్పాటు చేసుకున్నాడు. పరవాడ సంతబయలు నుంచి సినిమా హాల్ జంక్షన్‌కు వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని ఈ తతంగం జరిగింది.**

పరవాడ సంతబయలు నుంచి సినిమాహాల్ జంక్షన్‌కు వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని వినాయకుడి గుడి సమీపంలో పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 137లో గెడ్డవాగు ఉండేది. కాలక్రమేణా అది డ్రైనేజీలా మారిపోయింది. వాగును ఆనుకొని కొన్నేళ్ల క్రితం పంచాయతీ అధికారులు రక్షణ గోడ నిర్మించారు. కాగా గోడను ఆనుకొని అవతల వైపు ఉన్న స్థలాన్ని పరవాడకు చెందిన ఓ రియల్టర్ ఇటీవల కొనుగోలు చేశారు. సదరు స్థలంలోకి వెళ్లాలంటే దారి లేదు. రక్షణ గోడ ముందు భాగాన్ని గతంలో బహిర్భూమిగా వినియోగించుకునేవారు. ప్రస్తుతం అక్కడ ఉన్న పొదలను రియల్టర్ తొలగించేసి ఆ స్థలంలో నుంచి రక్షణ గోడను కొంత మేర ఎక్స్‌కవేటర్‌తో మంగళవారం రాత్రి కూలదోయించారు. వెనుక ఉన్న తన లేఅవుట్‌కు రహదారి ఏర్పాటులో భాగంగా పంచాయతీకి చెందిన కాలువను సైతం కప్పేశారు. దీంతో వాడుకనీరు వెళ్లే పరిస్థితి లేకపోయింది. ప్రభుత్వానికి చెందిన రక్షణ గోడను తొలగించినా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. రక్షణ గోడకు ముందు వైపు వాగుకు చెందిన సుమారు 10 సెంట్లు ప్రభుత్వ స్థలం ఉంది. ఆ స్థలాన్ని కూడా భవిష్యత్తులో సదరు రియల్టర్ ఆక్రమించుకునేందుకు స్కెచ్ వేసినట్టు ఇక్కడ జోరుగా ప్రచారం సాగుతోంది. పరవాడలోని ప్రధాన రహదారిని ఆనుకొని ప్రస్తుతం సెంటు భూమి రూ.15 లక్షల ధర పలుకుతోంది. ఈ లెక్కన రక్షణ గోడ ముందు ఉన్న స్థలం అక్షరాల రూ.కోటి 50 లక్షలు ఉంటుంది. ఈ స్థలం కోసమే రియల్టర్ రక్షణ గోడ అవతల వైపు ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి రక్షణగోడ కూల్చివేసిన రియల్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ స్థలం ... మిగతా 6వ పేజీలో

గర్భిణి మృతిపై విచారణ



ఆస్పత్రి రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ రమేశ్ కిషోర్

నర్సీపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో గర్భిణి మృతిపై డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేశ్ కిషోర్ బుధవారం విచారణ చేపట్టారు. ఎస్.రాయవరం మండలం చినగుమ్మలూరుకి చెందిన కంటె దేవి పురుడు పోసుకోవడానికి సోమవారం మధ్యాహ్నం ప్రాంతీయ ఆస్పత్రిలో చేరి మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయిందని బంధువులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేశ్ కిశోర్ ప్రసూతి వార్డు, లేబర్ రూమ్‌ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. గైనికాలజిస్టుని, నైట్ డ్యూటీలో ఉన్న సిబ్బందిని విచారించారు. కంటె దేవి ఆస్పత్రిలో చేరిన దగ్గర నుంచి మంగళవారం ఉదయం వరకు జరిగిన వైద్యం గురించి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారదను ఆరా తీశారు.

గోవాడ షుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం



కేన్ క్యారియర్‌లో చెరకుగడలు వేసి క్రషింగ్ ప్రారంభిస్తున్న ఎండీ సన్యాసినాయుడు, అధికారులు, కార్మికులు

- 1.5 లక్షల టన్నుల క్రషింగ్ లక్ష్యం
- చెరకు రైతులకు త్వరలో బకాయిల చెల్లింపు
- ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు

చోడవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో బుధవారం క్రషింగ్ సీజన్ లాంఛనంగా ప్రారంభమైంది. బుధవారం ఉదయం 9.30 గంటలకు కేన్ క్యారియర్ వద్ద పూజలు నిర్వహించిన అనంతరం ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు, అధికారులు, కార్మికులు కేన్‌లో చెరకుగడలు వేసి క్రషింగ్‌కు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ ముఖ్య వ్యవసాయాధికారి టి.రాముం, కార్మిక సంఘం నాయకులు శరగడం రామునాయుడు, రాయి సూరిబాబు, తలారి సత్యనారాయణలతో పాటు కార్మికులు, ఫ్యాక్టరీ అధికారులు పాల్గొన్నారు.

లక్షా 50 వేల టన్నుల క్రషింగ్ లక్ష్యం

ఈ ఏడాది గోవాడలో లక్షా 50 వేల టన్నుల చెరకు క్రషింగ్ చేయడంతో పాటు, 9.5 శాతం రికవరీ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు తెలిపారు. క్రషింగ్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది టన్నుకు రూ.3,151 మద్దతు ధర చెల్లించనున్నామన్నారు. ఫ్యాక్టరీ ... మిగతా 6వ పేజీలో

పెదబొడ్డేపల్లిలో భారీ చోరీ

80 గ్రాముల బంగారం, రూ.8.2 లక్షల నగదు అపహరణ



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నర్సీపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లిలోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. గొలుగొండ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ ఇంట్లోకి దొంగలు చొరబడి నగదు, బంగారం అపహరించారు. బాధితుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గొలుగొండ పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బీజేవీ ప్రసాద్ పెదబొడ్డేపల్లి అక్షయ ఆస్పత్రి సమీపంలో నివాసముంటున్నారు. మంగళవారం భార్య కమల నెహ్రూ, కుమార్తెతో కలిసి ఆయన సొంతూరు తుని వెళ్లారు. వారి ఇంటికి పక్క రోడ్డులో నివాసముంటున్న సూర్య ప్రభావతి బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రసాద్ ఇంటికి వచ్చింది. ప్రసాద్ కుటుంబానికి ప్రభావతి బాగా పరిచయస్తురాలు. వారు ఊరు వెళ్లిన సంగతి తెలియక ఇంటికి వచ్చి మెయిన్ డోరు తెరిచి ఉండడంతో నేరుగా లోపలకు వెళ్లి చూసింది. బెడ్‌రూమ్‌లో బీరువా తెరిచి దుస్తులు చెల్లాచెదురుగా ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి వ్యాపార సంస్థలు బంద్

- కూలి రేట్లు 50 శాతం పెంచకపోతే సమ్మె చేస్తామని ముఠా కూలీల నోటీసు
- పెను భారం పడుతుందని వ్యాపార సంఘాల వెల్లడి
- చర్చలు ఫలించకపోవడంతో బంద్‌కు వ్యాపారుల నిర్ణయం



బంద్ పాటించనున్నట్టు వెల్లడిస్తున్న వ్యాపార సంఘం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపార సంస్థలు ఈ నెల 26 నుంచి బంద్ చేస్తున్నట్టు అనకాపల్లి రైస్ మర్చంట్స్ అసోసియేషన్, ఆయిల్ మర్చంట్స్ అసోసియేషన్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం తెలిపారు. ముఠా వర్కర్లు కూలి రేట్లు పెంచాలని ఇచ్చిన నోటీసుపై మూడు దఫాలు చర్చలు జరిపినప్పటికీ వారు అంగీకరించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రస్తుతం వ్యాపార సంస్థలు ఇస్తున్న కూలి రేట్లకు అదనంగా 50 శాతం పెంచితేనే పని చేస్తామని, లేకపోతే ఈ నెల 26వ తేదీ నుంచి సమ్మె చేస్తామని ముఠా కూలీలు నోటీసు ఇచ్చారన్నారు. ప్రస్తుతం వ్యాపారులు 50 కిలోల బరువుకు రూ.9.64, అలాగే 26 కిలోలకు రూ.8.06, ఆయిల్ డబ్బాకు రూ.5.18 కూలీ చార్జిలు ఇస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రేట్లు ఇతర ప్రాంతాల కంటే అనకాపల్లిలోనే అధికంగా ఉన్నాయన్నారు. అది కాకుండా 50 శాతం అదనంగా పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఇంత మొత్తం కూలీ రేట్లు పెంచితే వ్యాపారులపై భారం పడుతుందన్నారు. అందువల్ల ఈ నెల 26 నుంచి వ్యాపార సంస్థలు బంద్ చేయాలని మూడు సంఘాల ప్రతినిధులు శ్రీధరాల సోమరాజు, బొడ్డేడ శంకరరావు, బీవీ రమణ, గుండా సాయి, కొత్తూరు లక్ష్మజీ, బొడ్డేడ సత్తిబాబు నిర్ణయించుకున్నట్టు తెలిపారు.



అచ్యుతాపురం: కొండకర్ల చర్చిలో మాట్లాడుతున్న రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు



పాయకరావుపేట ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



కోటవురట్ల కేకేబీ చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న అనకాపల్లి అప్పారావు

ప్రేమ, త్యాగానికి ప్రతీక యేసుక్రీస్తు

» రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు... » వాడవాడలా ఆనందోత్సాహాల నడుమ క్రిస్మస్ వేడుకలు

అచ్యుతాపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, త్యాగానికి ప్రతీక యేసు ప్రభువని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. క్రిస్మస్ సందర్భంగా కొండకర్లలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యేసు ప్రభోదించిన మార్గంలో అంతా నడిచి దేశ శాంతికి దోహదపడాలన్నారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావుని క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గుడివాడ జయకుమార్ ఘనంగా సన్మానించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రేవిడి కృష్ణ, టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి పొన్నమళ్ల కొండబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కంఠంరెడ్డి శ్యామలరాజు, కారుకుండి రమేష్, దాసరి నర్సింగరావు, బొద్దపు సుధాకర్, కోసూరి భాను, కుంచా రమణ, తదితరులు పాల్గొన్నారు. మండలంలో పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వివిధ చర్చిల్లో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేటలోని క్రిస్మస్ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలో ఆర్‌సీఎం, కల్వరీ బాప్టిస్ట్ చర్చిలతోపాటు అన్ని చర్చిలు ప్రత్యేకంగా అలకరించారు. మంగళవారం సాయంత్రం నుంచే ప్రత్యేక ప్రసంగాలు, ప్రార్థనలతో సందడిగా మారాయి. అర్ధరాత్రి 12 గంటలకు క్రిస్మస్ కేక్‌లు కట్‌చేసి అందరికీ పంచారు. బుధవారం క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పిల్లలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం బంధువులు, స్నేహితులతో విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

పట్టణం, మండలంలో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు చర్చి, అన్ని చర్చిల్లో వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనా గీతాలను ఆలపించారు. మునిసిపాలిటీలోని చర్చిలతోపాటు మండలంలోని రేగుపాలెం, పురుషోత్తపురం, ఏటికొప్పాక, పులపర్తి పలు గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు మిన్నంటాయి. ఎలమంచిలిలోని ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు చర్చిలో స్థానిక సీఐ ధనుంజయరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి సంఘ అధ్యక్షుడు టి.మోజెస్, కార్యదర్శి టి. ఆనందరాజు, ప్రతినిధులు సీఐను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు పాల్గొన్నారు.



ఎలమంచిలి చర్చిలో క్రిస్మస్ సందేశాన్ని వినిపిస్తున్న భక్తులు

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని చర్చిలలో బుధవారం క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అరట్లకోట ఏఎంబీ చర్చిలో సంఘ కాపరి గెడ్డం జయనాథ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చర్చిని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ వేడుకలలో సండే స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంఘ కాపరి జయనాధ్‌కుమార్, సంఘ పెద్దలు కేకును కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలలో చర్చి ఫౌండర్ కుటుంబ సభ్యులు మలకా విద్యాసాగర్, రాయి కిశోర్‌బాబు, డేగల ప్రసన్నకుమారి, జాజి, సుధ, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలో పలు గ్రామాల్లోని చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులతో చర్చిలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్థానిక క్రీస్తు కృపాలయ బాప్టిస్టు సంఘం ఆధ్వర్యంలో సంఘకాపరి రెవ.పీఆర్ బాబు మాట్లాడుతూ లోకరక్షకుడు యేసుక్రీస్తు ప్రతిఒక్కరినీ రక్షించడానికి ఈ లోకానికి వచ్చాడని వివరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు అనకాపల్లి అప్పారావు, సంఘం అధ్యక్షుడు ఆర్.ప్రసన్నకుమార్, కార్యదర్శి మట్ల ఆనంద్‌రాజు, కోశాధికారి బుకాదాసు, ఉపాధ్యక్షుడు ఎస్. కిరణ్ వరప్రసాద్, ఉపకోశాధికారి ఎం.సునాధ్‌బాబు, జాయింట్ సెక్రటరీ ఆర్. నానిమణి మహన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బేతస్థ ప్రార్థన మందిరంలో పాస్టర్ సత్యాడఎలీషా ఆనంద్ క్రీస్తు జననంపై బోధించారు.సత్యాడ దాసు, సన్యాసిరావు, స్టీవెన్‌సన్ పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని పలుగ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అప్పన్నపాలెం గ్లోరియా ఇమ్మానుయేల్ చర్చి, పంచదార్ల, కొత్తూరు, దిమిలి, లాలంకోడూరు, వాడనర్సాపురం, కొత్తపట్నం, గోవిందపాలెం, భోగాపురం, సెజ్ పునరావాస కాలనీల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిల్లో భక్తిగీతాలను ఆలపించి, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం పాస్టర్‌లు యేసుక్రీస్తు జన్మదిన సందేశాన్ని వివరించి, కేక్‌ను కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చిల్లో విందును ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో చర్చిల పాస్టర్‌లు సుధీర్, జాషువారాయ్, కాలేబ్, జేమ్స్, అప్పారావు, పీటర్, జాన్‌మోజెస్, శామ్యూల్ హైజాక్ క్రైస్తవులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండు రోజుల ముందు నుంచి చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ విశిష్టత గురించి పాస్టర్లు వివరించారు. ఉపమాకలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, కొల్నాటి బుజ్జి పాల్గొన్నారు. జానకయ్యపేట, నెల్లిపూడి, డీఎల్‌పురం, వేంపాడు, నక్కపల్లి, రాజయ్యపేట, చందనాడ, గుల్లిపాడు, ఉద్దండపురం, దేవవరం, గొడిచెర్ల గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పలు చర్చిల్లో బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వెంకటాపురం బేతేలు చర్చిలో పీఆర్‌టీయూ మండల సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. చర్చి పాస్టర్ విక్టర్ పాల్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ విక్టర్ పాల్‌ను పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన

... 5వ పేజీ తరువాయి

వేసుకున్నారు. వరి కోత దశలో ఉన్న పొలాల్లో వర్షపు నీరు చేరకుండా రైతులు గట్టు కట్టుకొంటున్నారు. ఇప్పటికే కోసిన వరి కంకులను కట్టలు కట్టి కుప్పలు వేసుకొనే పనిలో నిమగ్నమయ్యారు. బుధవారం రోజంతా పలు మండలాల్లో మబ్బులు కమ్ముకున్నాయి. పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. రాగల 24 గంటల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది.

కంట్రోల్ రూమ్‌ల కొనసాగింపు

వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ కొనసాగించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మండలాల నుంచి సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో 08924-226599, అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో 9491998293, నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో 7075356563 ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు.

సహకార పదవులకు పోటీ

... 5వ పేజీ తరువాయి

ముందు టీడీపీలో చేరిన దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు కూడా డీసీసీబీ పదవి ఆశిస్తున్నారు. ఈ ముగ్గురూ వెలమ సామాజిక వర్గానికి చెందినవారు. వీరు కాకుండా అనకాపల్లి నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ కూడా డీసీసీబీ రేస్‌లో ఉన్నారు. ఇంకా మరికొందరు పార్టీ నాయకులు డీసీసీబీ, డీసీఎంఎస్ రేసులో ఉన్నారని, అయితే వారిలో కొందరు తమ పేర్లు బయట పెట్టకుండా ఎమ్మెల్యేలను కలవడంతోపాటు అధిష్ఠానాన్ని కలిశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. డీసీసీబీ, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి పదవులు ఒకే వర్గానికి కాకుండా రెండు ప్రధాన సామాజిక వర్గాలకు ఇస్తే సమతుల్యత పాటించినట్టు అవుతుందని పార్టీ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు. జిల్లాలో 98 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించనున్నందున గ్రామ స్థాయి నాయకుల పేర్లతో జాబితాలు రూపొందించే పనిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. త్వరలో 98 సంఘాలకు సంబంధించిన జాబితాలను అధిష్ఠానానికి పంపనున్నారు. కొత్త సంవత్సరం ప్రారంభంలో నామినేటెడ్ పదవులు పంపిణీ చేయనున్నారు.

గోవాడ షుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

పరిధిలో ఈ ఏడాది 2,760 ఎకరాల్లో ఉడుపు తోటలు, 7,349 ఎకరాల్లో కార్శి తోటల్లో చెరకు ఉందన్నారు. లక్షా 50 వేల టన్నులకు రైతులతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నామని తెలిపారు. ఇవి కాక అదనంగా మరో 10 వేల టన్నుల చెరకు కూడా రైతుల నుంచి వస్తుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది రూ.6 లక్షలు ఖరీదు చేసే 2.32 లక్షల విత్తనంతోపాటు 2,540 బస్తాల యూరియా రైతులకు సరఫరా చేశామన్నారు. ఫ్యాక్టరీ సభ్య రైతుల సంక్షేమ నిధి కింద మృతి చెందిన 366 మంది చెరకు రైతుల కుటుంబాలకు కోటి 9 లక్షల 8 వేల రూపాయలు పరిహారం చెల్లించామన్నారు. మరో 280 మంది రైతులకు పరిహారం చెల్లించవలసి ఉందని, దీనిని కూడా త్వరలో చెల్లించనున్నామని తెలిపారు. ఈ ఏడాది రైతులు, కార్మికుల సహకారంతో ఈ సీజన్ చక్కగా నడిపించాలని ప్రయత్నం చేస్తున్నామని, ఈ దిశగా రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. గత సీజన్‌కు సంబంధించిన బకాయిలు, రైతులకు రవాణా చార్జీలు కలిపి చెల్లించవలసిన బకాయిలు కూడా త్వరలో చెల్లించడానికి చర్యలు చేపట్టామన్నారు. అలాగే పౌరసరఫరాలశాఖ ద్వారా కొంత మొత్తం అడ్వాన్సు తీసుకుని రైతులకు ప్రతి 15 రోజులకోసారి పేమెంటు ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

రియల్టర్ బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

అన్యాక్రాంతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే రక్షణ గోడ ముందు ఉన్న ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని పరవాడ తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకువెళ్లగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

పెదబొడ్డేపల్లిలో భారీ చోరీ

... 5వ పేజీ తరువాయి

ఉండడం చూసి వెంటనే ఇంటికి వెళ్లి కోడలికి చెప్పింది. ఆమె కోడలు ప్రసాద్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. వారు తుని నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి మెయిన్ డోరు, సైడ్ డోరు తెరిచి ఉన్నాయి. తాళం కప్పలు కనిపించ లేదు. చిల్డ్రన్ బెడ్ రూమ్, మాస్టర్ బెడ్ రూమ్‌లోని బీరువాలు తెరిచి దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించారు. రెండు బీరువాలలో భద్రపరిచిన రూ.8.2 లక్షల నగదు, సుమారు 80 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు ప్రసాద్ విలేకరులకు తెలిపారు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూజ్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించింది. బాధితుల నుంచి డీఎస్పీ మోహన్‌ప్రసాద్ వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో రూరల్ సీఐ రేవతమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వాజపేయి శతజయంతి వేడుకలు

ఎలమంచిలి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పెదపల్లి వార్డులో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శత జయంతి ఉత్సవాన్ని బీజేపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తల సమక్షంలో వాజపేయి చిత్రపటానికి వార్డు అధ్యక్షుడు పప్పు ఈశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు బొద్దపు శివ, మల్లిరెడ్డి రమణ, కె.పండు, ఎం.యామల పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని కొత్తపేట అమ్మవారి ఆలయంలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్‌బిహారీ వాజపేయి జయంతిని బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు జి.గోవిందిరెడ్డి, నాగమంతుల శ్రీనివాసరావు, సూరాడ నూకరాజు, ఎరుపల్లి సోమేష్, చింతకాయల చంటి, ధర్మాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి జయంతిని బుధవారం నక్కపల్లిలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోసూరి శ్రీనివాసరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు పోలినాటి నానాజీ తదితరులు వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గట్టెం నానాజీ, కొల్నాటి అప్పారావు, దాడిశెట్టి ఈశ్వరరావు, శ్రీరంగం రమేశ్, కిల్లాడ రాజు, ఈగల తాతియ్యలు పాల్గొన్నారు.



నక్కపల్లిలో వాజపేయి జయంతి నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



ఎస్.రాయవరం: గుడివాడలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రవిరాజు, నూకరాజు తదితరులు

ఎస్.రాయవరంలో..

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుడివాడలో వాజపేయి విగ్రహానికి బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ దూళి నూకరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, మండల అధ్యక్షుడు జోగినాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చీరల పంపిణీ చేశారు. పెదగుమ్ములూరు, కొత్తపోలవరం, ఎస్.రాయవరం, కర్రివానిపాలెం గ్రామాల్లో వాజపేయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మునగపాకలో..

స్థానిక ఎన్టీఆర్ కాలనీలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాజపేయి చిత్రపటానికి బీజేపీ నాయకుడు బద్దెం సూర్యనారాయణ, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేగి అప్పలనాయుడు, సోమరాజు, దేవర, భీమవరపు కన్నఅప్పారావు, శ్రీనివాస్, బద్దెం ప్రతాప్ పాల్గొన్నారు.

చేనేత సొసైటీ ఆధీనంలోకి కార్మికుల సామాజిక భవనం

పాయకరావుపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తరువాత పట్టణంలోని చేనేత కార్మికుల సామాజిక (ఫ్యాషన్ టెక్నాలజీ) భవనం చేనేత సొసైటీకి ఆధీనంలోకి వచ్చింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ భవనంలో ఫ్యాషన్ టెక్నాలజీ యూనిట్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి డీఆర్‌డీఏ అధికారులు ఈ భవనాన్ని తమ ఆధీనంలో ఉంచుకుని ఇతరులకు లీజుకిచ్చేవారు తప్ప దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని చేనేత సొసైటీకి చెల్లించేవారు కాదు. దీంతో చేనేత సొసైటీ ప్రతినిధులు ఆ భవనం తమకు అప్పగించాలని కోరుతూ అప్పటి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తులు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. రాష్ట్రంలో ఎన్డీఏ



టీడీపీ నాయకుల చేతుల మీదుగా తాళం అందుకుంటున్న చేనేత సొసైటీ కార్యదర్శి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి చేనేత సొసైటీ సభ్యులు సామాజిక భవనం సమస్యను తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె సామాజిక భవనాన్ని చేనేత సొసైటీకి తిరిగి అప్పగించేలా జిల్లా కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీలను ఒప్పించడంతో సామాజిక భవనం తాళాలు సొసైటీకి చేరాయి. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సామాజిక భవనం తాళాలను టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు చేతుల మీదుగా చేనేత సొసైటీ కార్యదర్శి, నాయకులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు హోం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, కర్రా వీరవెంకటేశ్వరరావు, కడిం భాస్కరరావు, బళ్ళ దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ అభివృద్ధికి ఊతం

విశాఖలో ఎస్‌టీపీఐ ఇంక్యుబేషన్ సెంటర్ నిర్మాణానికి శ్రీకారం

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఐటీ రంగం అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖను ఐటీ హబ్‌గా మార్చడానికి కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ చొరవతో ఆరు నెలల వ్యవధిలో రెండు అతి పెద్ద కంపెనీలు విశాఖపట్నం రావడానికి ఒప్పందాలు చేసుకున్నాయి. అందులో ఒకటి టీసీఎస్ కాగా మరొకటి గూగుల్. ఐటీ పార్కులోని డల్లాస్ టెక్నాలజీస్ భవనంలో కార్యకలాపాలు ప్రారంభించాలని టీసీఎస్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం మరో విశేషం చోటుచేసుకుంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) ఇంకుబేషన్ సెంటర్ నిర్మాణానికి ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని 'ఎ హబ్' పక్కన ఎకరా స్థలంలో భూమి పూజ నిర్వహించింది. ఇక్కడ సుమారు రూ.30 కోట్ల వ్యయంతో ఐదు అంతస్థుల భవనం నిర్మిస్తారు. ఈ సెంటర్ విశాఖపట్నం నుంచి ఐటీ ఎగుమతులు పెంచడానికి కృషిచేస్తుంది. అదే విధంగా చిన్న పరిశ్రమలను ప్రోత్సహిస్తుంది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలో విద్యార్థులకు శిక్షణ కూడా ఇస్తుంది. ఏయూ విద్యార్థులకు ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం జరిగింది. కాగా ఎస్‌టీపీఐ ఇంకుబేషన్ ఏర్పాటుకు రెండేళ్ల క్రితమే ఏయూ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే అప్పటి ప్రభుత్వం ఆ ఫైల్‌ను పక్కన పెట్టేసింది. ఇప్పుడు ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రిగా లోకేశ్ ఉండడం, విశాఖలో ఐటీ ప్రతినిధులు ఎస్‌టీపీఐ భూమి విషయం ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఫైల్ క్లియర్ చేశారు. ఎస్‌టీపీఐ కోరిన ఎకరా భూమి కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

దాంతో ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్ బుధవారం భూమి పూజ చేశారు. వీలైనంత త్వరగా సెంటర్ నిర్మాణం పూర్తిచేయాలని ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావును కోరగా..తప్పకుండా చేస్తామని అరవింద్‌కుమార్ హామీ ఇచ్చారు.

వాలీబాల్ టోర్నీ విజేత నామవరం జట్టు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపురం జడ్పీ హైస్కూల్‌లో క్రిస్మస్ సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో నామవరం జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో ఈదటం జట్టు ద్వితీయ స్థానం, శ్రీరాంపురం జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి.

మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నామవరం జట్టు కెప్టెన్ సమాద్ నిలిచారు. విజేత నామవరం జట్టుకు రూ.8 వేలు నగదును టీడీపీ నియోజకవర్గ యూత్ కన్వీనర్ చించలపు ప్రదీప్, ద్వితీయ బహుమతి పొందిన జట్టుకు రూ.5వేలు పల్లెల వెంకట్, తృతీయ బహుమతి పొందిన జట్టుకు 3 వేలు గోగాడ నాని అందించారు. టోర్నమెంట్ నిర్వహణకు శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, బొడ్డపాటి నాగేశ్వరరావు, గంగిరెడ్డి నాని, బత్తిన చంద్రరావు, బొడ్డపాటి వీరాస్వామి, బత్తిన గోవిందు, కూండ్రపు నాగేశ్వరరావు ఆర్థిక సహాయం అందించారు.

ఉపమాక వెంకన్నకు ప్రాకార సేవ



ఆలయంలో ప్రాకార సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా బుధవారం వర్షం కారణంగా తిరువీధి సేవ రద్దయింది. దీంతో కింద ఆలయంలో ఆస్థాన మండపం చుట్టూ పల్లకీలో గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి ప్రాకార సేవ నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీ పద్మశ్రీ దృష్టికి మత్స్యకారుల సమస్యలు



పద్మశ్రీకి వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టరు చోడిపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వెంకటనగరం మత్స్యకారులు బుధవారం కాకినాడలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మత్స్యకార భరోసా రూ.20 వేలు, మత్స్యకారులకు 90 శాతం రాయితీ మీద వలలు, ఇంజన్ బోట్లు ఇప్పించాలని, వెంకటనగరంలో మినీ జెట్టీ ఏర్పాటు చేయాలని కోరారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ పద్మశ్రీ హామీ ఇచ్చినట్టు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సిరిపల్లి శ్రీను, సూరాడ కోటి, శ్రీను, తాతారావు, గోపి, అర్జిల్లి చిట్టిబాబు, నూకరాజు, కాశీరావు, ఎరిపల్లి ఎల్లారీ, పెదకాపు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా మేలుకొలుపులు



కొత్తపాలెంలో మేలుకొలుపు చేపట్టిన భక్తులు

ఎలమంచిలి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వేడుకల్లో భాగంగా గ్రామ గ్రామాన శ్రీమన్నారాయణుని చిత్రపటం పట్టుకుని తెల్లవారు మేలుకొలుపు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కొత్తపాలెంలో బుధవారం తెల్లవారు జామున గ్రామస్థులంతా కలిసి మేలుకొలుపు నిర్వహించారు. ఈనెల 15వ తేదీ రాత్రి నెల గంట పెట్టడంతో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మునిసిపాలిటీలో కొత్తపాలెం, తులసీనగర్, ధర్మవరం, కొత్తపేట, యర్రవరం ప్రాంతాల్లో మేలుకొలుపులు నిర్వహించారు.

మునగపాకలో..

మండలంలోని పలు గ్రామాల్లో మేలుకొలుపులు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున నాగులాపల్లిలో మేలుకొలుపు పూజలు జరిగాయి. మునగపాక, వాడ్రాపల్లి, చూచుకొండ తదితర గ్రామాల్లో ధనుర్మాసం ప్రారంభం రోజు నుంచి ప్రతిరోజు తెల్లవారుజామున మేలుకొలుపు సంకీర్తనలు జరుగుతున్నాయి.

జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తా చాటిన 'పేట' కుర్రాళ్లు



బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తా చాటినవారిని అభినందిస్తున్న తోట నగేశ్

పాయకరావుపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీహార్‌లో జరిగిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన ఇద్దరు కుర్రాళ్లు సత్తా చాటారు. ఈనెల 21వ తేదీన బీహార్‌లో జరిగిన 57వ జూనియర్ జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పట్టణంలోని ఎస్‌జే జిమ్‌లో శిక్షణ పొందిన దుర్గాప్రసాద్ జాతీయ స్థాయిలో రెండవ స్థానం, జయచంద్ నాల్గో స్థానం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం వీరిని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జే జిమ్ నిర్వాహకులు మంచాల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

71 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

నక్కపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉపమాక హైవే జంక్షన్ వద్ద బుధవారం బైక్‌పై మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేశామని సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు స్థానిక విలేకర్లకు చెప్పారు. జానకయ్యపేట గ్రామానికి చెందిన కె.లోవరాజు బైక్‌పై 71 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పట్టుకొని, అరెస్టు చేశామన్నారు. బైక్ సీజ్ చేసినట్టు వారు చెప్పారు.

తిమ్మరాజుపేటలో సుదర్శన నృసింహ యాగం

మునగపాక, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిమ్మరాజుపేటలో బుధవాంంం సుదర్శన నృసింహ యాగాన్ని నిర్వహించారు. గ్రామంలోని వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ప్రాంగణంలో వేద పండితులు పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా యాగాన్ని నిర్వహించారు. పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

ఎస్.రాయవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చురుగ్గా జరుగుతున్నది. బుధవారం ఎస్.రాయవరంలో వార్డు మెంబరు భీమరశెట్టి సత్యనారాయణ, టీడీపీ నేత కందుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదును చేపట్టారు. కార్యక్రమంలో ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ మండల జాయింట్ సెక్రటరీ అంకాబత్తుల రమణ, నాయకులు మద్దాల శ్రీనివాసరావు, గూడుపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గొర్లివానిపాలెంలో పెట్టిన గాలి కుప్పలు

తడిసిన వరి

» మొలకలు వస్తుండడంతో అన్నదాతలు ఆందోళన

సబ్బవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గత వారం రోజులుగా కొనసాగుతున్న వాతావరణం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తుంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట ముున్ముందు తినేందుకు పనికి వస్తుందా.. లేదా అనే ఆలోచనలో పడేసింది. పలు చోట్ల వరి పంటను కోసి రైతులు పొలాల్లో ఉంచారు. ఇంతలో అల్పపీడనం ఏర్పడడంతో దానిని కల్లాలకు తెచ్చుకునే అవకాశం లేకపోయింది. దీంతో పొలాల్లోనే ఉంచేశారు. ఇందులో చాలా మంది పంట ఎండ కుండానే ఆదరా బాదరాగా కుప్పలు పెట్టేశారు. ప్రస్తుతం అది తడిసి పోవడంతో గొర్లివానిపాలెం, వంగలి, గుల్లేపల్లి, ఆదిరెడ్డిపాలెం, అసకపల్లి, టిక్కలిపాలెం, లగిశెట్టిపాలెం తదితర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుంటే, మరికొందరు రైతులు వాతావరణ శాఖ అధికారులు ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో వరి పంటను కోత కోయకుండా వదిలేశారు. దీంతో ఆ వరిచేళ్లు తడిసి, గాలులకు ఓ వైపు ఒరిగి పోయాయి. దీంతో చేనుకు నీరు, మట్టి పట్టడంతో మొలకలు వస్తున్నట్టు పలువురు రైతులు చెపుతున్నారు. మడుల్లో పెట్టిన గాలి గుప్పల్లో సైతం నీరు దిగి గింజలకు కూడా మొలకులు వస్తున్నాయని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థం కాని స్థితిలో ఉన్నారు. పంటను కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని వారంతా కోరుతున్నారు. ఇదిలావుంటే, ఈనెల 26 తరువాత మరో తుపాను ఉందన్న సమాచారంతో రైతులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. కాగా సబ్బవరంలో మంగళవారం 3.2 ఎంఎం, బుధవారం 4.0 ఎంఎం వర్షపాతం నమోదైందని మండల వ్యవసాయాధికారిణి రమాదేవి తెలిపారు.



గుల్లేపల్లిలో తడిసిపోవడంతో పాడైన వరిపంట

గుంతలమయం.. ప్రయాణాలు భయం..

రూపుమారిన చింతనిప్పల అగ్రహారం రహదారి

» వర్షాలకు నీరుచేరడంతో బురదమయం

» పాదచారులకు సైతం ఇబ్బందులు

» ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని పాలకులు

తుమ్మపాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి మండలంలోని చింతనిప్పుల (సీహెచ్ఎన్) అగ్రహారం రహదారి అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడ్డాయి. పూర్తిగా తారు లేయర్ లేచిపోవడంతో రోడ్డు రూపు మారింది. చిన్నపాటి వర్షానికి సైతం బురదమయంగా తయారవుతోంది. దీంతో ఇటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యపై ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా చెవిన వేసుకునేవారు కరువయ్యారని అక్కడి వారంతా వాపోతున్నారు.

నిత్యం రద్దీ

ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. మాకవరం, మార్టూరు, రేబాక, తుమ్మపాల తదితర గ్రామాలకు చెందినవారు రాకపోకలు సాగిస్తుంటారు. చింతనిప్పుల అగ్రహారం- మాకవరానికి మధ్య గల ఈ రహదారి సుమారు మూడు కిలో మీటర్ల మేర అత్యంత దారుణంగా తయారైంది. కొద్ది పాటి వర్షానికి నీరు అందులో చేరుతోంది.



రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులు



బురదమయంగా మారిన రహదారి

ఇది గుర్తించలేని పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

సబ్బవరం నుంచి అనకాపల్లికి ఇదే ప్రధాన రహదారి

సబ్బవరం జాతీయ రహదారి నుంచి చింతనిప్పుల అగ్రహారం మీదుగా మాకవరం, మార్టూరు, తుమ్మపాలతో పాటు అనకాపల్లి పట్టణానికి చేరుకోవడానికి ఇదే ప్రధాన రహదారి. అలాగే అనకాపల్లి, తుమ్మపాల తదితర గ్రామాల నుంచి సబ్బవరం జాతీయ రహదారికి చేరుకునే వారు సైతం ఈ రోడ్డులోనే ప్రయాణం సాగిస్తుంటారు. ఏళ్ల తరబడి ఈ రోడ్డును పాలకులు గాని, అధికారులు గాని పట్టించుకోలేదు. ఫలితంగానే ఈ దుస్థితి ఏర్పడిందని అంటున్నారు.



అధ్వానంగా ఉన్న చింతనిప్పుల అగ్రహారం రహదారి

క్వారీ, క్రషర్ల నుంచి భారీ వాహనాలు రాకపోకలు

ఇదిలావుంటే, ఈ రోడ్డులో పగలు, రాత్రి అనే తేడా లేకుండా క్వారీ, క్రషర్ల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు దారుణంగా మారడంతో రాత్రి వేళల్లో ప్రయాణించేవారు ఏకంగా చుట్టూ నాలుగు కిలోమీటర్లు తిరిగి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. గత వైసీపీ పాలనలో శాశ్వత ప్రాతిపదికన ఈ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదని అంతా వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ రోడ్డు నిర్మించాలని అంతా కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు



అగ్రహారం రోడ్డులో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డులో రాకపోకలు సాగించే వారి వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోతేంది. దీనికితోడు క్వారీ, క్రషర్ల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది.

- మద్దాల మోహనరావు, సీహెచ్ఎన్ అగ్రహారం

రాత్రి వేళ ప్రయాణాలు భయం భయం



ఈ రోడ్డులో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటే భయాందోళన చెందుతున్నాం. ఎక్కడికక్కడ గోతులు పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక వర్షం కురిసిందంటే ఇక్కడ ప్రయాణం నరకప్రాయంగా మారుతుంది. రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళ విద్యుత్ దీపాలు లేకపోవడంతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- తనకాల ఆదినాయుడు, సీహెచ్ఎన్ అగ్రహారం

నృసింహావతారంలో వేంకటేశ్వరస్వామి



అనకాపల్లి, కశింకోటలలో నరసింహావతారంలో స్వామి

అనకాపల్లి టౌన్/ కశింకోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మా సోత్సవాల్లో భాగంగా అనకాపల్లి గాంధీనగరంలోని వేంకటేశ్వర ఆలయంలో బుధవారం నృసింహావతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు రేజేటి చక్రవర్తి తొలుత స్వామిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ వేడుకల్లో భాగంగా స్వామిని మూడు రోజులకో అవతారంలో అలంకరిస్తున్నారు. అలాగే, కశింకోటలోని వేంకటేశ్వర ధ్యాన మందిరంలో స్వామివారు నారసింహావతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు రేజేటి శ్రీరామా చరణాచార్యులు, రేజేటి మారుతి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముఠా కార్మికుల కూలీ రేట్లు పెంచాలని ఆందోళన



సంఘ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న ముఠా కార్మికులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముఠా కార్మికుల కూలీ రేట్లు పెంపుపై ప్రభుత్వం స్పందించాలని ముఠా కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడి మార్కెట్ సమావేశమయ్యారు. ముందుగా వారంతా నిరసన తెలియజేశారు. ముఠా కార్మిక సంఘం నాయకుడు భీశెట్టి అప్పారావు మాట్లాడుతూ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని నోటీసు ఇచ్చి 20 రోజులు గడిచిందన్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. ఈ అంశంపై ఇప్పటికే మూడు దఫాలు చర్చలు జరిగాయన్నారు. బస్తాలు మోసి మోసి కార్మికులు అనారోగ్య పాలవుతున్నారని వాపోయారు. తక్షణమే కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గురువారం నుంచి సమ్మెకు దిగుతామని, ఇందుకు వర్తకులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గంటా శ్రీరామ్, తిర్రి సురేష్, కాపుశెట్టి అప్పారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాలాడుతున్న ఒకరి అరెస్టు

కశింకోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సుందరయ్యపేట పంచాయతీ లాలం కొత్తూరు గ్రామ శివారులో కోడి పందాలాడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు కశింకోట పోలీస్ స్టేషన్ రైటర్ సూర్యారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కోడిపందాలు జరుగుతున్న ప్రాంతంలో బుధవారం దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా రెండు కోడి పుంజులు, రూ.వెయ్యి నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అదే గ్రామానికి చెందిన లాలం రాజేశ్ పట్టుబడడంతో అరెస్టు చేశామన్నారు. మిగిలినవారు పరారు కావడంతో, వారికోసం గాలిస్తున్నట్టు చెప్పారు.

ఫొటో, వీడియోగ్రఫీపై యువతకు అవగాహన సదస్సు



ఫొటో, వీడియోగ్రఫీలో అవగాహన కల్పిస్తున్న నిపుణుడు

సబ్బవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గొటివాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం దుర్గమాంబ ఫొటోస్, వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఫొటో, వీడియోగ్రఫీపై యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిపుణుడు సతీష్ శెట్టి ఫొటోలు, వీడియోలు తీయడంతో మెలకువలను వివరించారు. సోనీ వర్క్‌షాప్ అధినేత నటరాజ్ కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షులు మధు, రమేశ్, సబ్బవరం మండల సంఘం ప్రతినిధులు కె.అప్పారావు, ఎస్.రాజేశ్, బి.శివ, జి.మధు, ఎస్. నాగేంద్ర, కిశోర్, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, రాము తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా క్రిస్మస్ వేడుకలు



అనకాపల్లి సెంటినరీ బాప్టిస్టు చర్చిలో మాట్లాడుతున్న చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ



కశింకోట బాప్టిస్టు చర్చిలో మలసాల భరత్‌కుమార్ తదితరుల ప్రార్థనలు



సబ్బవరం సీబీఎం చర్చిలో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు బుధవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో జరిగిన వేడుకలకు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ హాజరై ప్రసంగించారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి అనుసరణీయమన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ 80వ వార్డు ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు, చర్చి నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే, పునీత పౌలు కథోలిక దేవాలయం, మన్నా చర్చి, లూథరన్ చర్చి, పెంతెకోస్తల్ చర్చి, ఇమ్మానుయేల్ ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను జరిపారు. క్రైస్తవులు కుటుంబ సభ్యులతో సహా చర్చిలకు విచ్చేసి ప్రార్థనలు చేశారు. పలు చర్చిల్లో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఆ పార్టీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తుమ్మపాల చర్చిలో పాస్టర్ కొత్తపల్లి జయరాజ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను జరిపారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద హాజరయ్యారు. అదేవిధంగా పలు ప్రైవేటు పాఠశాలల్లోనూ ఈ వేడుకలను నిర్వహించారు. పలువురు విద్యార్థులు శాంతాక్లాజ్, మేరీ, జోసెఫ్ వేషధారణలో ఆకట్టుకున్నారు.

అనకాపల్లి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిరసపల్లిలోని బాప్టిస్టు చర్చి, మారేడుపూడి, కొత్తూరు చర్చిలలో క్రైస్తవులు కుటుంబాలతో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ముందుగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సబ్బవరం సీబీఎం చర్చిలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హాజరై కేక్ కట్‌చేసి క్రైస్తవులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి అనుసరణీయమన్నారు. కల్వరీ అపోస్టలిక్ చర్చిలో జరిగిన వేడుకలకు సీఐ పిన్నింటి రమణ హాజరై పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే అన్ని చర్చిల్లోనూ ఈ వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోట ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సంఘ కాపరి పాస్టర్ ప్రైసు నీల్‌బాబు ఆధ్వర్యంలో క్రీస్తు జన్మదిన సందేశాన్ని వినిపించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ పెద్ద కె.శ్యామలరాజు, కె.మదన్‌కుమార్, ఎస్.మధుసూదన్, కె.వరప్రసాద్, ఎన్.కృపావరం తదితరులు పాల్గొన్నారు. అలాగే, కశింకోట బాప్టిస్టు చర్చిలో జరిగిన వేడుకలకు వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ హాజరై కేక్ కట్‌చేశారు. అనంతరం అంతా కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో వాజ్‌పేయి పాత్ర అమోఘం

» శతజయంత్యుత్సవంలో కీర్తించిన వక్తలు



అనకాపల్లిలో వాజ్‌పేయి విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్సీ బుద్ద నివాళి

అనకాపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతిని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రింగ్‌రోడ్డులో గల ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి అమోఘమని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన అందించిన సహకారం గొప్పదిగా కీర్తించారు. ఈ కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బుద్ద భువనేశ్వరరావు, బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు పి.నాయుడు, చద రం శివ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. వాజ్‌పేయి అభిమాని ఒమ్మి రాముయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, బీజేపీ నాయకులు భర్ణికాన నరసింహమూర్తి, గంగుపాం నాగేశ్వరరావు, మావూరి రవికుమార్, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలు చీరలు పంపిణీ చేశారు.



పరవాడ మండలం పి.బోనంగిలో..

కొత్తూరు : మాజీ ప్రధాని, వాజ్‌పేయి శతజయంతిని అనకాపల్లి రింగు రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడుతూ దేశాభివృద్ధికి ఆయన అందించిన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొణతాల రాజాబాబు, నాయకులు కొణతాల అప్పలరాజు, కొండబాబు, రమేష్, మారిశెట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రింగురోడ్డులోని వాజ్‌పేయి విగ్రహం వద్ద బీజేపీ నేతల నివాళి

పరవాడ : వాజ్‌పేయి శతజయంతి వేడుకలను మండల కేంద్రం పరవాడలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకుడు కూండ్రపు సోమునాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు కూండ్రపు చినబాబు, పైలా జగన్నాథరావు, గొర్లె శ్రీనుబాబు, బం డారు అజయ్‌కుమార్, లాలం సురేశ్ తదితరులు పాల్గొన్నారు. పి.బోనంగిలో జరిగిన వాజ్‌పేయి జయంతిలో బీజేపీ నాయకుడు బండారు రాజశేఖర్, కూటమి నాయకులు గొంతిన రాము, జెర్రిపోతుల పెంటారావు, సంజీవ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

14 మద్యం బాటిళ్లు స్వాధీనం

» ఒకరిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వేల్పులవీధి జంక్షన్‌లో అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వ్యక్తిని మంగళవారం రాత్రి పట్టుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన ఒమ్మి నాగ అప్పారావును హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు అనుమానం వచ్చి తనిఖీ చేయగా అతని వద్ద పద్నాలుగు మద్యం క్వార్టర్ బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

28న సబ్బవరం మండల సమావేశం

సబ్బవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 28వ తేదీ శనివారం జరగనుందని ఎంపీడీవో పద్మజ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారన్నారు. సర్పంచ్‌లు, ఎంటీసీలు, ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

నిరుపేదల సేవలో స్వచ్ఛంద సంస్థలు



ఆనందపురంలో క్షతగాత్రుడు బాబూరావుకు సాయం అందించిన సంస్థ ప్రతినిధులు

కశింకోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆనందపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ గొల్ల బాబూరావుకు సాయానికి 10రూపాయలు సేవా సంస్థ ప్రతినిధులు బుధవారం రూ.40వేల ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల ఎలమంచిలి వద్ద జరిగిన లారీప్రమాదంలో అతని కుడికాలును పూర్తిగా తొలగించారు. ఈయనకు ఇద్దరు సంతానం. ప్రస్తుతం బాబూరావు మంచాన పడడంతో ఈ విషయం తెలుకుని సహాయం అందించామని సంస్థ ప్రతినిధులు ఏసుబాబు, అనీల్, చిరంజీవి, గొర్లి అప్ప లనాయుడు, అనీల్‌కుమార్, చిరంజీవి, సతీష్, రామకృష్ణ, శివనాయుడు, రమణ, అప్పి శ్రీని వాసరావు తదితరులు తెలిపారు.

కొత్తూరు : నిరంతర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో పలువురు యాచకులకు 225 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేబాక మధుబాబు, ఎన్.శ్రీనివాసరావు, కొమ్మోజు గణేష్, నారాయణరావు, కలగా నూకేష్ తదితరులు పాల్గొన్నారు.


కొయ్యూరులో దైవ సందేశం వినిపిస్తున్న మతప్రభోదకురాలు


పాడేరులో క్రిస్మస్ వేడుకలు


అనంతగిరి: మర్ధగుడలో కేక్ కట్‌చేస్తున్న జడ్పీటీసీ గంగరాజు

కరుణామయుని సందేశం అనుసరణీయం

» ఘనంగా క్రిస్మస్ వేడుకలు » తెల్లవారుజాము నుంచే చర్చిల్లో ప్రార్థనలు » అలరించిన ప్రార్థనా గీతాలు » సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారుల సందడి

కొయ్యూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలను అనుసరించి ప్రతి ఒక్కరూ వేరొకరి సహాయం చేస్తూ ముందుకు సాగాలని మత ప్రబోధకులు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో చర్చిల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలను బుధవారం నిర్వహించారు. ప్రార్థనా మందిరాలు ఆధ్యాత్మిక సందేశాలు, గీతాలతో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. రావణాపల్లి బీలీవర్ చర్చిలో దైవజ్ఞులు మాగాపు రాజు క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. కొమ్మిక ఆదివాసీ ప్రభావితపథం చర్చిలో పాస్టరు ఎస్. బాబూరావు లోకరక్షకుడు ఏసు మా నవాళికి అందించిన సేవలను వివరించారు. కొయ్యూరు యునైటెడ్ చర్చిలో దైవ జ్ఞులు దివంగత సైమన్ భార్య ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత ప్రబోధకులు మాట్లాడుతూ దైవంపై పూర్తి నమ్మకం క లిగిన వారికి కరుణ ఉంటుందన్నారు. మతం ఏదైనా మానవత్వమే అందరి అభిమతం కావాలని సూచించారు. అలాగే రాజేంద్రపాలెం ఒలీవల, పెం తెకోస్తు, ఫిల్డెల్ఫియా, క్రైస్తు చర్చిల్లో మత బోధకులు క్రిస్మస్ విశిష్టతను చాటిచెప్పారు. రావణాపల్లి, కొయ్యూరు, రాజేంద్రపాలెం తదితర చర్చిల్లో పేద వృద్ధ స్త్రీలకు బట్టలు పంపిణీ చేశారు. క్రిస్మస్ పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి

పాడేరులో

పాడేరురూరల్: పాడేరు మండలంలో వాడవాడలా క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు బుధవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులంతా కుటుంబ సభ్యులతో సమీపంలో ఉన్న చర్చిలకు వెళ్లి భక్తి శ్రద్ధలతో ప్రార్ధనలు జరిపారు. పాడేరు పట్టణ పరిసరాల్లో సుమారు 25 వరకు చర్చిలు ఉన్నప్పటికి ప్రధానంగా బాప్టిస్టు చర్చి, ప్రభువైన ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం, సర్వోన్నతుడైన దేముని మందిరం, లవ్ అండ్ కేర్ చర్చ్, కారుణ్య ప్రార్థన మందిరం, నిబంధన ప్రార్థనా మందిరాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక క్రీస్తు గీతాలాపనలు, చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దైవజ్ఞులు తిమోతి, బి.ఎలీషారావు, దైవకృప, డేవిడ్, పెడ్రిక్, డానియల్, సాల్‌మన్ ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. సర్వోన్నతుడైన దేముని మందిరంలో సంఘ సభ్యుల సమక్షంలో పాస్టర్ ఎలీషారావు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘ ప్రతినిధులు శ్రీను, మనోహర్, శేఖర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో

సీలేరు: సీలేరులో యూసీఐఎం, కల్వరి, పెంతుకోస్తు, గేస్తుమనే, షాలేము ప్రార్థనా మందిరం చర్చిల్లో కేక్‌లను కట్ చేసి , ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. యూసీఐఎం చర్చిలో పాస్టర్ మనస్సే ఆధ్వర్యంలో చిన్నారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు పలువురు క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో పలు చర్చిల్లో క్రైస్తవులు ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. బుధవారం క్రిస్మస్‌ను పురస్కరించుకుని సుర్రవరం, చాపరాతిపాలెం ఆదివాసీ ప్రభావిత పథం చర్చిల్లో సీనియర్ పాస్టర్ వసుపరి సోమరాజు, పాస్టర్ కంకిపాటి ఈశ్వరరావు, సిరిబాల యూసీఐఎం చర్చిలో పాస్టర్ వి. తిమోతి క్రీస్తు జననంపై ఉదేశం చేశారు. ఈసందర్భంగా యువతీ, యువకులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ క్రీడలు, బైబిల్ క్విజ్ పోటీల్లో గెలుపొందిన సండేస్కూల్ విద్యార్థులకు బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు జుంబు బాలరాజు, పోతురాజు, పార్వతీ, దేహూరి కృష్ణబాబు, వంతల విజయరాజు, వీజే దయానంద్, కొయ్యూరు ఎంఈవో ఎల్.రాంబాబు పాల్గొన్నారు. చింతపల్లి ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో పాస్టర్ డేవిడ్, ఆదివాసీ ప్రభావిత పథం చర్చిలో పాస్టర్ డి. ఈనక్, నిస్సీ ప్రార్థన మందిరంలో పాస్టర్ జాన్ క్రీస్తు జననంపై సందేశం వినిపించారు. ఈసందర్భంగా నృత్య ప్రదర్శనల ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దురియా పుష్పలత, జీసీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు హేమంత్ కుమార్, సంఘ పెద్దలు సురేశ్, మల్లేశ్, శంకర్, గోవింద్ పాల్గొన్నారు.

అనంతగిరి: ఎగువశోభ పంచాయతీ మర్ధగుడ చర్చిలో స్థానిక సంఘకాపరి సీహెచ్.నీలయ్య ఆధ్వర్యంలోని జరిగిన క్రిస్మస్ పండుగ వేడుకల్లో జడ్పీటీసీ గంగరాజు పాల్గొని కేక్ కట్‌చేశారు. చిన్నారులు వేసిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ సింహాద్రి, క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని చికుమద్దుల పంచాయతీ ముసిరిపాడు గ్రామంలో హౌస్ ఆఫ్‌ఫెలోషిప్ దైవ సేవకుడు కొండతాబేలి


చాపరాతిపాలెంలో విద్యార్థులకు బహుమతులిస్తున్న సంఘం పెద్దలు

పీటర్ జెస్సీ దంపతులకు పిల్లలు, వృద్ధులకు తమ దుస్తులు పంపిణీ చేశారు. వీరిని దైవ సేవకులు ఘనంగా సన్మానం చేశారు. వైస్ ఎంపీ కొండలరావు క్రీస్తు పరిచర్యతో కూడిన ప్రత్యేక క్యాలెండర్ ఆవిష్కరించారు.

ముంచంగిపుట్టు: మండల పరిధిలో చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ కేక్‌లను కట్ చేసి అందరికీ పంచారు. లోకరక్షకు'డు ఏసుక్రీస్తు జన్మించిన వేళలో చర్చిల్లో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. ప్రేమ విందును ఏ ర్పాటు చేశారు. క్రీస్తు గీతాలకు చిన్నారులు చేసిన నృత్యాలు చేశారు. పాస్టర్లు సరేష్, మోహనరావు, రత్నమణి, బర్నబస్, ప్రసాదరావు చర్చిల్లో ఏసుక్రీస్తు సందేశాన్ని వినిపించారు.


ముంచంగిపుట్టు చర్చిలో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

ఏయూ ఖోఖో కోచ్‌గా పీడీ శివరామ్‌కుమార్ ఎంపిక


కోచ్‌గా ఎంపికైన శివరామ్‌కుమార్

చింతపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రవిశ్వ విద్యాయం ఖోఖో కోచ్‌గా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శివరామ్ కుమార్ నియమితులయ్యారు. ఈనెల 27తేదీ నుంచి 31 వరకు తమిళనాడు తిరువరూర్‌లో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్నేషనల్ స్థాయి క్రీడలు జరనున్నాయి. ఈక్రీడల్లో ఏయూ పరిధి క్రీడాకారులు హాజరుకానున్నారు. ఈ క్రీడారులకు కోచ్‌గా శివకుమార్‌ను ఏయూ అధికారులు ఎంపిక చేశారు. ఆయనను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస పాత్రుడు అభినందించారు.

సిమిలిగుడలో తాగునీటి సమస్యకు పరిష్కారం


కొళాయి ప్రారంభిస్తున్న దృశ్యం

హుకుంపేట డిసెంబరు 25 ఆంధ్రజ్యోతి ; రంగశీల పంచాయితి సిమిలి గుడ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న తాగు నీటి సమస్య పరిష్కరించినట్లు సర్పంచ్ జనకమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సుశీల తెలిపారు. బుధవారం తాగునీటి కొళాయిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థులు సమీప గెడ్డలో నీటి తెచ్చుకుని వినియోగించుకునేవారన్నారు. కలుషిత నీటితో సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. ఈనేపథ్యంలో సమస్య పరిష్కరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు మోహన్ దాస్, దాసు సోమన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా వాజపేయి శత జయంతి

పాడేరురూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అగ్రనాయకుడు, భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి శత జయంతి వేడుకలను బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, నాయకులు రాఘవేంద్రరావు, కె.వెంకటరమణ, వేమనబాబు, అబ్బులు, టి.సత్యవతి, పి.రవికుమార్, పాపిటి రాజు పాల్గొన్నారు.

ఐటీ అభివృద్ధికి ఊతం

» విశాఖలో ఎస్‌టీపీఐ ఇంక్యుబేషన్ సెంటర్ నిర్మాణానికి శ్రీకారం
» ఏయూలో స్థలం కేటాయింపు
» రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు
» తొక్కిపెట్టిన నాటి వైసీపీ ప్రభుత్వం
» ప్రస్తుత ఐటీ మంత్రి లోకేశ్ చొరవతో ఫైల్‌కు మోక్షం
» ఎగుమతులు పెంపునకు కృషిచేయనున్న సెంటర్
» విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఐటీ రంగం అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖను ఐటీ హబ్‌గా మార్చడానికి కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ చొరవతో ఆరు నెలల వ్యవధిలో రెండు అతి పెద్ద కంపెనీలు విశాఖపట్నం రావడానికి ఒప్పందాలు చేసుకున్నాయి. అందులో ఒకటి టీసీఎస్ కాగా మరొకటి గూగుల్. ఐటీ పార్కులోని డల్లాస్ టెక్నాలజీస్ భవనంలో కార్యకలాపాలు ప్రారంభించాలని టీసీఎస్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం మరో విశేషం చోటుచేసుకుంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) ఇంకుబేషన్ సెంటర్ నిర్మాణానికి ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని 'ఆ హబ్' పక్కన ఎకరా స్థలంలో భూమి పూజ నిర్వహించింది. ఇక్కడ సుమారు రూ.30 కోట్ల వ్యయంతో ఐదు అంతస్థుల భవనం నిర్మిస్తారు. ఈ సెంటర్ విశాఖపట్నం నుంచి ఐటీ ఎగుమతులు పెంచడానికి కృషిచేస్తుంది. అదే విధంగా చిన్న పరిశ్రమలను ప్రోత్సహిస్తుంది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలో విద్యార్థులకు శిక్షణ కూడా ఇస్తుంది. ఏయూ విద్యార్థులకు ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం జరిగింది. కాగా ఎస్‌టీపీఐ ఇంకుబేషన్ ఏర్పాటుకు రెండేళ్ల క్రితమే ఏయూ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే అప్పటి ప్రభుత్వం ఆ ఫైల్‌ను పక్కన పెట్టేసింది. ఇప్పుడు ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రిగా లోకేశ్ ఉండడం, విశాఖలో ఐటీ ప్రతినిధులు ఎస్‌టీపీఐ భూమి విషయం ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఫైల్ క్లియర్ చేశారు. ఎస్‌టీపీఐ కోరిన ఎకరా భూమి కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దాంతో ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్ బుధవారం భూమి పూజ చేశారు. వీలైనంత త్వరగా సెంటర్ నిర్మాణం పూర్తిచేయాలని ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావును కోరగా...తప్పకుండా చేస్తామని అరవింద్‌కుమార్ హామీ ఇచ్చారు.

మెగా రక్తదాన శిబిరం రేపు


రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి గౌరీశంకరరావు

పాడేరురూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి):పాడేరు కాఫీ హౌస్‌లో ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. గౌరీశంకరరావు కోరారు. జిల్లా కేంద్రంలోని రక్త నిల్వల కేంద్రంలో పూర్తిగా రక్త నిల్వలు అందుబాటులో లేనందున జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, రెడ్ క్రాస్ ఛైర్మన్, జేసీ అభిషేక్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యువతీ, యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రెవెన్యూ, పోలీస్ శాఖ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన కోరారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టినాయుడుకు ఘన నివాళి


రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఈశ్వరప్రసాద్

పాడేరురూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): దివంగత నేత , మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి చిట్టినాయుడు 13వ వర్ధంతిని ఆయన కుమారుడు ఈశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు, అభిమానులు, వర్తక సంఘం ప్రతినిధులు బుధవారం నిర్వహించారు. స్థానిక మణికంఠ లాడ్జీ ఎదుట చిట్టినాయుడు విగ్రహానికి ఈశ్వర ప్రసాద్ కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అభిమానులతో కలిసి రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి చిట్టినాయుడు ఆశయసాధనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కె.ద్రాక్షాయిని, కె.మృదాణి, కె.చరణ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, ఉమానీలకంఠేశ్వర స్వామి సహిత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి రొబ్బి రాము, సింహాచలం, బిమలపూజారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌ఈవో హఠాన్మరణం


జోజిబాబు (ఫైల్ ఫొటో)

సీలేరు, డిసెంబరు 25 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు పీహెచ్‌సీలో ఆరోగ్య విస్తరణాధికారి (ఎంపీహెచ్‌ఈవో)గా విధులు నిర్వహిస్తున్న కె జోజిబాబు ఆకస్మికంగా మృతి చెందారు. స్థానిక వైద్యాధికారి ఎస్‌కే మస్తాన్‌వల్లీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోజిబాబు క్రిస్మస్ పండగను తన కుటుంబ సభ్యులతో జరుపుకునేందుకు తన స్వగ్రామమైన ఏలేశ్వరం వెళ్లారు. మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో అతనికి ఊపిరి అందక (కార్డియోక్రస్ట్‌తో) అస్వ స్థతకు గురికావడంతో వెంటనే కుటుంబ సభ్యులు పిఠాపురం హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందారని తెలిపారు. మృతి చెందిన ఆయనకు నలుగురు కుమారులు ఉన్నారని, జోజిబాబు గత ఏడాదిగా సీలేరు పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో మన్యం జిల్లా గరుగుబిల్లి పీహెచ్‌సీలో పని చేసి 143 జీవోలో సీలేరుకు వచ్చారు. జోజిబాబు మృతికి పీహెచ్‌సీ సిబ్బంది తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఏకధాటి వర్షాలతో కాఫీ పంటకు నష్టం


వర్షాలకు రాలిన కాఫీ పండ్లు


బిర్సింగి గ్రామంలో కాఫీ గింజలకు పల్ప్ తీస్తున్న గిరిజనులు

హుకుంపేట డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి); బంగాళాఖాతం అల్పపీడనంతో భారీ వర్షలు కురవటంతో కాఫీ పంటకు తీ వ్ర నష్టం వాటిల్లడంతో గిరిజన రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని మూడు రోజులు నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో చెట్లకు పండిన కాఫీ పండ్లు రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. వర్షాలనుంచి రక్షణకు తోటల్లో నేలకు రాలిన పండ్లు త్వరితగతిన ఎప్పటికప్పుడు ఏరివేస్తున్నారు. వీటిని పల్పర్‌గా తయారు చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో బిర్సింగ్ గ్రామంలో కాఫీ పంట తక్కువ దిగుబడి వచ్చింది. దీనికి తోడు వర్షాలతో ఉన్న పండ్లు నేలరాలి మరింత నష్టం కలిగిస్తోందని వారు వాపోతున్నారు. పల్పర్ తయారుచేసినా ఎండ లేక ఇళ్లలో బస్తాలతో నిల్వ చేయడంతో పాడైపోతోందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఐటీడీఏ పండ్లు మాత్రమే కోనుగోలు చేసి పిక్కలు కేవలం కనిష్ఠ ధర రూ. 44 చెల్లిస్తోంది.

దీంతో కష్టానికి తగిన ఫలితం రావడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా, ఆధికారులు స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

1నుంచి బయోమెట్రిక్‌పై మార్గదర్శకాలు

పాడేరురూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాలకు బయోమెట్రిక్ హాజరు నమోదులో జనవరి ఒకటో తేదీనుంచి కొత్త మార్గదర్శ కాలు అమలు కానున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక, రోజువారీ హాజరును గుర్తించడానికి జీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్ యాప్‌ను ఉపయోగిస్తున్నట్టు పేర్కొన్నారు. అన్నిరకాల సెలవులను హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్ ద్వారా మాత్రమే సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతితో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1-5, వీఆర్‌వోలు గ్రేడ్ 1తో సహా అన్ని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి వారి హాజరు గుర్తింపులో మినహాయింపు లేదన్నారు. నెలవారీ జీతాల చెల్లింపునకు దీనినే పరిగణలోకితీసుకుంటామన్నారు. సచివాలయ స్థాయిలో అందించాల్సిన సేవలు ఉద్యోగులు అందుబాటులో లేక ప్రజలు అసంతృప్తికి లోనుకాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఈ మార్గదర్శకాలను అక్షరాలా అమలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

జాతీయ వాలీబాల్ జట్లు ఎంపిక

పాడేరురూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీన విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ స్థాయి వాలీబాల్ పురుషులు, మహిళలు జట్లు ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్ జైపూర్‌లో సీనియర్ జాతీయ వాలీబాల్ పురుషులు, మహిళలు క్రీడా పోటీలు జరగనున్న నేపథ్యంలో ఈ ఎంపికలను చేపడుతున్నారన్నారు. ఆసక్తిగల జిల్లాలోని క్రీడాకారులు 27వ తేదీ ఉదయం 7 గంటలకు ఆధార్ కార్డు, స్థానికతపై ధ్రువపత్రం, 10 పాస్ ఫొటోలతో క్రీడా ప్రాధికార సంస్థ ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడలోని వాలీబాల్ గ్రౌండ్‌లో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్: 93944 94645 సంప్రదించాలని కోరారు.

కరాటే పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ


జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

పాడేరురూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ ద్రోణ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో ఇంద్రపాలెంలో ఈ నెల 22వ తేదీన జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాలోని హుకుంపేట మండలం దొరపేట గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులుప్రతిభను కనపరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ మర్రి సత్తిబాబు, కరాటే శిక్షణ కేంద్ర అధ్యక్షుడు మర్రి శ్రీను , చైర్మన్ నందకదొర రామారావు తెలిపారు. ఈ కరాటే పోటీల్లో మర్రి చిన్న, మర్రి సిద్ధులు బంగారు పతకాలను, మర్రి విక్కి కాంస్య పతకం సాధించినట్టు చెప్పారు. ఈ విద్యార్థుల విజయానికి ప్రోత్సహించిన సంబంధిత పాఠశాల యాజమాన్యం, పిల్లల తల్లిదండ్రులను వారు అభినందించారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరిలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చూపాలని వారు ఆకాంక్షించారు.

రియల్టర్ బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

అన్యాక్రాంతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే రక్షణగోడ ముందు ఉన్న ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని పరవాడ తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకువెళ్లగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

గోవాడ షుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

పరిధిలో ఈ ఏడాది 2,760 ఎకరాల్లో ఉడుపు తోటలు, 7,349 ఎకరాల్లో కార్శి తోటల్లో చెరకు ఉందన్నారు. లక్షా 50 వేల టన్నులకు రైతులతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నామని తెలిపారు. ఇవి కాక అదనంగా మరో 10 వేల టన్నుల చెరకు కూడా రైతుల నుంచి వస్తుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది రూ.6 లక్షలు ఖరీదు చేసే 2. 32 లక్షల విత్తనంతో పాటు 2,540 బస్తాల యూరియా రైతులకు సరఫరా చేశామన్నారు. ఫ్యాక్టరీ సభ్య రైతుల సంక్షేమ నిధి కింద మృతి చెందిన 366 మంది చెరకు రైతుల కుటుంబాలకు కోటి 9 లక్షల 8 వేల రూపాయలు పరిహారం చెల్లించామన్నారు. మరో 280 మంది రైతులకు పరిహారం చెల్లించవలసి ఉందని, దీనిని కూడా త్వరలో చెల్లించనున్నామని తెలిపారు. ఈ ఏడాది రైతులు, కార్మికుల సహకారంతో ఈ సీజన్ చక్కగా నడిపించాలని ప్రయత్నం చేస్తున్నామని, ఈ దిశగా రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. గత సీజన్‌కు సంబంధించిన బకాయిలు, రైతులకు రవాణా చార్జీలు కలిపి చెల్లించవలసిన బకాయిలు కూడా త్వరలో చెల్లించడానికి చర్యలు చేపట్టామన్నారు. అలాగే పౌరసరఫరాలశాఖ ద్వారా కొంత మొత్తం అడ్వాన్సు తీసుకుని రైతులకు ప్రతి 15 రోజులకోసారి పేమెంటు ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

వదలని వాన

... 5వ పేజీ తరువాయి

వేసుకున్నారు. వరి కోత దశలో ఉన్న పొలాల్లో వర్షపు నీరు చేరకుండా రైతులు గట్టు కట్టుకొంటున్నారు. ఇప్పటికే కోసిన వరి కంకులను కట్టలు కట్టి కుప్పలు వేసుకొనే పనిలో నిమగ్నమయ్యారు. బుధవారం రోజంతా పలు మండలాల్లో మబ్బులు కమ్ముకున్నాయి. పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. రాగల 24 గంటల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది.

కంట్రోల్ రూమ్‌ల కొనసాగింపు

వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ కొనసాగించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మండలాల నుంచి సమాచారం అందించేందుకు అనకాపల్లి కలెక్టరేట్‌లో 08924-226599, అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో 9491998293, నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో 7075356563 ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు.

సహకార పదవులకు పోటీ

... 5వ పేజీ తరువాయి

ముందు టీడీపీలో చేరిన దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు కూడా డీసీసీబీ పదవి ఆశిస్తున్నారు. ఈ ముగ్గురూ వెలమ సామాజిక వర్గానికి చెందినవారు. వీరు కాకుండా అనకాపల్లి నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ కూడా డీసీసీబీ రేస్‌లో ఉన్నారు. ఇంకా మరికొందరు పార్టీ నాయకులు డీసీసీబీ, డీసీఎంఎస్ రేసులో ఉన్నారని, అయితే వారిలో కొందరు తమ పేర్లు బయట పెట్టకుండా ఎమ్మెల్యేలను కలవడంతోపాటు అధిష్ఠానాన్ని కలిశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. డీసీసీబీ, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి పదవులు ఒకే వర్గానికి కాకుండా రెండు ప్రధాన సామాజిక వర్గాలకు ఇస్తే సమతుల్యత పాటించినట్టు అవుతుందని పార్టీ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు. జిల్లాలో 98 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించనున్నందున గ్రామ స్థాయి నాయకుల పేర్లతో జాబితాలు రూపొందించే పనిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. త్వరలో 98 సంఘాలకు సంబంధించిన జాబితాలను అధిష్ఠానానికి పంపనున్నారు. కొత్త సంవత్సరం ప్రారంభంలో నామినేటెడ్ పదవులు పంపిణీ చేయనున్నారు.

పెదబొడ్డేపల్లిలో భారీ చోరీ

... 5వ పేజీ తరువాయి

ఉండడం చూసి వెంటనే ఇంటికి వెళ్లి కోడలికి చెప్పింది. ఆమె కోడలు ప్రసాద్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. వారు తుని నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి మెయిన్ డోరు, సైడ్ డోరు తెరిచి ఉన్నాయి. తాళం కప్పలు కనిపించ లేదు. చిల్డ్రన్ బెడ్ రూమ్, మాస్టర్ బెడ్ రూమ్‌లోని బీరువాలు తెరిచి దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించారు. రెండు బీరువాలలో భద్రపరిచిన రూ.8.2 లక్షల నగదు, సుమారు 80 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు ప్రసాద్ విలేకరులకు తెలిపారు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూజ్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించింది. బాధితుల నుంచి డీఎస్పీ మోహన్‌ప్రసాద్ వివరాలు సేకరించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో రూరల్ సీఐ రేవతమ్మ పాల్గొన్నారు.

మాడుగుల, చోడవరం

సీహెచ్‌సీల స్థాయి పెంపు

» 50 పడకల ఆస్పత్రులుగా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
» నర్సీపట్నం ఆస్పత్రిలో సీటీ స్కానింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు
» డీసీహెచ్‌ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు


డాక్టర్ శ్రీనివాసరావు

నర్సీపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చోడవరం, మాడుగుల సీహెచ్‌సీలను 50 పడకల ఆస్పత్రులుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ జిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నక్కపల్లిలో ట్రామా కేర్ బ్లాక్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలో సీటీ స్కానింగ్ ఏర్పాటు చేయడానికి రూ.2.5 కోట్లతో అంచనాలు తయారు చేశారని వివరించారు. అనకాపల్లి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రులు సుఖ ప్రసవాలలో మెరుగైన సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రసూతి కేసులు రిఫరల్ చేయకూడదని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. అత్యవసరమైతే 108 అంబులెన్స్‌లో విశాఖపట్నం తరలించవచ్చు అని స్పష్టం చేశారు. ప్రభుత్వ అంబు లెన్స్‌లు అందుబాటులో లేకపోతే ప్రైవేటు అంబులెన్స్‌లో పంపించాలన్నారు. తల్లి బిడ్డ మరణాలు సంభవించ కూడదని ప్రభుత్వ ఉద్దేశంగా పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జా!

» ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు


ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, చదును చేసిన దృశ్యం

మాకవరపాలెం,డిసెంబరు 25 : ప్రభుత్వ భూమి కబ్జా చేయడమే కాకుండా, దానికి ఆనుకుని ఉన్న కొండగెడ్డలు సైతం కలిపేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని రాచపల్లి రెవెన్యూ పరిధిలో రామన్నపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జా చేసి పక్కనే ఉన్న కొండగెడ్డలను కప్పివేస్తున్నారు. గత వారం రోజులుగా ఈ భూమిని జేసీబీలతో చదును చేసి మడులు చేస్తున్నారు. గతంలో ఈ కబ్జా చేసిన భూమిని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మళ్లీ అదే భూమిని చదును చేసి సరుగుడు మొక్కలు నాటుతుండడం విశేష. దీనిపై బుధవారం గ్రామానికి చెందిన అడిగర్ల శ్రీనివాసురావు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు ఎవ్వరూ అక్కడికి రాకపోవడంతో ఆక్రమణదారులు చకాచకా పనులు కానిచ్చేస్తున్నారు. సర్వే నంబరు 597లో సుమారు ఐదు ఎకరాల భూమి ఉంది. గతంలో కొంతమంది రైతులు ఈ భూమిని ఆక్రమణ చేయడంతో అప్పట్లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు సదరు బోర్డులు తొలిగించి ప్రభుత్వ భూములను యథావిధిగా అక్రమణ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, కొండగెడ్డలు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

చిరుజల్లులతో పల్లె రోడ్లు చిత్తడి

» గత నాలుగైదు రోజులుగా ఇదే వాతావరణం » తడిసి ముద్దవుతున్న జనం » పలు రోడ్లపై నీరు నిలిచిపోవడంతో అవస్థలు


కృష్ణాదేవిపేట బస్ స్టేషన్‌లో దుస్థితి


ఏఎల్‌పురం సీసీ రోడ్డుపై పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా గొలుగొండ మండలంలో చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో జనం అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గత నాలుగైదు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంటుండడంతో తడుసుకుంటూనే ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. గ్రామీణ ప్రాంత రహదారులు చిత్తడి మారాయి.ప్రధానంగా ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, కొంగసింగి తదితర గ్రామాల్లో రోడ్లు మరీ దారుణంగా ఉన్నాయి. పలుచోట్ల బురదమయంగా మారడంతో అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. అలాగే, ఏఎల్‌పురం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో వర్షపు నీరు ఎటూ వెళ్లే మార్గం లేక నిలిచిపోయింది. దీంతో బస్సులు ఇక్కడికి వచ్చి వెళ్లే సమయాల్లో ఆ నీరు తమపై తుళ్లతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇదిలావుంటే, కృష్ణాదేవిపేట- నర్సీపట్నం ప్రధాన రహదారిలోని రామచంద్రపురం, లింగంపేట, గొలుగొండ తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ గోతులు పడడంతో వాటిలో వర్షపు నీరు చేరింది. ఇది గుర్తించలేని పలువురు ద్విచక్ర వాహనచోదకులు చిన్న చిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆయా రహదారులకు మరమ్మతులు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

నాతవరం మండల సర్వసభ్య సమావేశం రేపు

నాతవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాతవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఉషశ్రీ తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చేపట్టి, చేపట్టనున్న పనులపై చర్చించనున్నామన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయాశాఖల అధికారులు విధిగా హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

వాడవాడలా ఘనంగా క్రిస్మస్ వేడుకలు


గొలుగొండ మండలం ఏఎల్‌పురం చర్చిలో ప్రార్థనలు


నర్సీపట్నం ఆంధ్రా బాప్టిస్ట్ క్రైస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నర్సీపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ వేడుకలను బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఇక్కడి ఆంధ్రా బాప్టిస్ట్ క్రైస్ట్ చర్చి, సెంటినరీ బాప్టిస్ట్ చర్చి తదితరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రైస్తవులంతా కుటుంబాలతో సహా చర్చిలకు విచ్చేశారు. తొలుత ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆంధ్రా బాప్టిస్ట్ క్రైస్ట్ చర్చిలో శివలంక జోన్స్ అమృతవల్లి ఆధ్వర్యంలో నిరుపేదలకు వస్త్రాలను పంచిపెట్టి, అన్నదానం చేశారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండలంలో క్రిస్మస్‌ను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. గొలుగొండ, చీడిగుమ్మల, జోగంపేట, ఏటిగైరంపేట, పాకలపాడు, గుండుపాల, కొత్తఎల్లవరం, ఏఎల్‌పురం, చోద్యం, సీహెచ్.నాగాపురం, గైరంపేట, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, విప్పలపాలెం తదితర గ్రామాల్లో గల చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలను జరిపారు. కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఆంధ్ర బాప్టిస్టు చర్చిలో ఈ వేడుకలను మరింత ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత, చర్చి అధ్యక్షుడు సీహెచ్ డేవిడ్ డైమన్‌రాజు, కార్యదర్శి లోచల రమేష్, జాన్‌బాబు, మాజీ సర్పంచ్ కుందూరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాకవరపాలెంలో క్రీస్తు చర్చి ఆధ్వర్యంలో ఉదయం నుంచి కోలాహల వాతావరణం నెలకొంది. చిన్నారులు డ్యాన్స్‌లు, పాటలతో అలరించారు. పాల్ పాస్టర్, కిరణ్‌పాల్ మాట్లాడుతూ క్రీస్తు పుట్టుక గురించి అందరికీ తెలియజేశారు. అలాగే బూరుగుపాలెం, తామరం, వీపీ అగ్రహారం, గిడుతూరు చర్చిల్లో క్రైస్తవులంతా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

పెదబొడ్డేపల్లిలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న గురుబాబు

నర్సీపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెదబొడ్డేపల్లిలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మరిడిమాంబ కాలనీలో పట్టణ కార్యదర్శి గురుబాబు ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలన, కుల వివక్ష, భూ సంస్కరణకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటాలలో సీపీఐ ఎక్కువగా పాల్గొందని గుర్తు చేశారు. 1950-60 మధ్యకాలంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉండేదని, నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని వివరించారు. 1925 డిసెంబరు 26 తేదీన పార్టీ ఆవిర్భావంచి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 31 వరకు పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు చోద్యం పీఏసీఎస్‌లో వ్యవహారంపై విచారణ

గొలుగొండ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చోద్యం పీఏసీఎస్‌కు సంబంధించి 'ఒక ఉద్యోగం- రెండు జీతాలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం డీసీసీబీ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో రికార్డులు తనిఖీ చేసి, నివేదిక అందించాలని జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్, చోద్యం సొసైటీ ఇన్‌చార్జి శ్రీనివాసరావును జిల్లా కో-ఆపరేటివ్ అధికారిణి స్వరూపారాణి ఆదేశించారు. ఈ సందర్భంగా చోద్యం సొసైటీ ఇన్‌చార్జి 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. చోద్యం పీఏసీఎస్‌లో జీవో 151 ప్రకారం అమలు చేసిన వేతనం కంటే అధికంగా రూ.16 లక్షలు కార్యదర్శి దుర్వినియోగం చేశాడనే అభియోగంపై తక్షణం నివేదిక అందించాలని ఉన్నతాధికారిణి ఆదేశించారన్నారు. సొసైటీలో కార్యదర్శిగా రాజు పనిచేస్తూ పీఏసీఎస్‌లో పదిహేనేళ్లుగా డ్రాచేసి చేసిన సొమ్ముకు సంబంధించి నివేదికను జిల్లా కార్యాలయానికి అందించనున్నట్టు వివరించారు.

నిత్యావసర సరకులు పంపిణీ

మాకవరపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాకవరపాలెం, వీపీ అగ్రహారంలలో వంద మంది మహిళలకు నర్సీపట్నానికి చెందిన సమగ్ర రైతు సహకార స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సబ్సిడీపై నిత్యావసర సరకులను బుధవారం అందించారు. మహిళల ఆర్థిక స్థిరత్వం కోసం రూ.పద్నాలుగు వందలు విలువైన వివిధ నిత్యావసర వస్తువులను అందించారు.

అన్నదాత కడగండ్లు


తడిసిన వరిపనలతో రైతులు

మాడుగుల రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడుతుండడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలో చాలా చోట్ల వరి కుప్పలు వేశారు. కొన్ని చోట్ల కోసిన వరి పనలు చేనులోనే వదిలేయడంతో వర్షాలకు తడిచిపోయాయి. కింతలిలో వర్షానికి వరి పనలు తడిచిపోవడంతో రైతులు వాటిని తీసి ఆరపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. చేతికి అందిన పంట ఇలా నష్టపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పెద్దేరు నుంచి 350 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేరు జలాశయం నుంచి బుధవారం రాత్రి 350 క్యూసెక్కుల నీటిని జలాశయం అధికారులు విడిచిపెట్టారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. కాగా ప్రస్తుతం 188 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.40 మీటర్లకి చేరింది. వర్షాలు పడుతున్నందున, నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువవుతున్నందున జలాశయం మూడో నంబరు గేటు ఎత్తి 350 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్టు ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన రేపు


పోస్టర్ విడుదల చేస్తున్న ధర్మశ్రీ, వైసీపీ నాయకులు

చోడవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఈనెల 27 శుక్రవారం అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ఆందోళనలు నిర్వహించనున్నట్టు మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తలతో సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ నేతలకు పాలన చేతకాక, ప్రజలపై రూ. 16 వేలకోట్ల భారం వేయాలని చూస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబు, అందుకు విరుద్ధంగా నిర్ణయాలు అమలు చేస్తున్నట్టు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈనెల 27న అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద పార్టీశ్రేణులు శాంతియుతంగా నిరసనలు చేపట్టి వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. ఈనెల 27న బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్ర మంలో వైసీపీ నాయులు ఏడువాక సత్యారావు, సేనాపతి సత్యారావు, పల్లా నరసింగరావు, సిమ్మునాయుడు, బొడ్డేడ సూర్యనారాయణ, చవితిన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

చీడికాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో ఈనెల 26, 27, 28 తేదీలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హేమసుందరరావు బుధవారం తెలిపారు. 26న తురువోలు, చుక్కపల్లి సచివాలయాల వద్ద , 27న జి. కొత్తపల్లి, జెబి.పురం సచివాలయాల వద్ద, 28న చీడికాడ, అర్జునగిరిల్లో ఈ క్యాంపులు నిర్వహించనున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈ బాధ్యతలు తీసుకోవాలని ఆయన తెలిపారు.


కొత్తకోట ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


మాడుగులలో

అంగరంగ వైభవంగా క్రిస్మస్ వేడుకలు

రావికమతం డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. క్రైస్తవులు ఏసు క్రీస్తును కీర్తిస్తూ పాటలు పాడుతూ మంగళవారం రాత్రంతా గ్రామాల్లో ఊరేగింపులు చేశారు. చర్చిల్లో ప్రార్థనలు చేస్తూ జాగరణ చేశారు. చర్చిలు విద్యుత్ కాంతులతో కళకళలాడాయి. పలు ఇళ్ల వద్ద స్టార్‌తో పాటు క్రిస్మస్ ట్రీ, క్రీస్తు జన్మనించిన పశువుల శాలలను ఏర్పాటు చేశారు. బాల బాలికలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తకోట ఆర్‌సీఎం చర్చిలో మంగళవారం రాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి ఉల్లాసంగా గడిపారు.చర్చి పాదర్ అజయ్ ప్రసంగించారు.

రోలుగుంట : స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కొత్తకోట నుంచి విచారణ గురువు విజయ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రపంచాన్ని శాంతియుతంగా నడిపించడంలో కీలక భూమిక వహిస్తున్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ చిన్నతనం నుంచి దైవం పట్ల విశ్వాసంతో ఉండాలన్నారు. ఈ వేడుకల్లో రోలుగుంటతోపాటు రావికతమం, నర్సీపట్నంకు చెందిన పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక ఆర్‌సీఎం కనికరమాత చర్చిలో వేకువజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏసు పుట్టుకతో పాటు చరిత్రను పాదర్ ప్రసంగించారు. ఇళ్లలో క్రైస్తవులు ఏసుక్రీస్తు జననానికి సంబంధించి పలు రకాల సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో యేసు రూపంతో నాటికలు, నృత్యాలు తదితర సాంస్కృతి కార్య క్రమాలు అలరించాయి.

మాడుగుల రూరల్ : మండలంలో క్రిస్మస్‌ను ఆనందంగా జరుపుకున్నారు. గ్రామాల్లో గల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వీట్లు పంచి పెట్టారు. క్రైస్తవ సోదరులకు హిందువులు, ముస్లింలు ప్రత్యేకంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మాడుగుల ఆర్‌సీఎం చర్చిల్లో క్రీస్తు జననం, బాల ఏసు తదిదర వాటిని ఎంతో అందంగా తీర్చిదిద్దారు. చిన్నారుల నృత్యాలు ఎంతగానో అలరించాయి.


రోలుగుంట ఆర్‌సీఎం చర్చిలో ..

దేశాభివృద్ధిలో మాజీ ప్రధాని వాజ్‌పేయి సేవలు నిరుపమానం

» జయంతి వేడుకల్లో బీజేపీ నాయకులు

కె.కోటపాడు: దేశాభివృద్ధిలో మాజీ ప్రధాని వాజపేయి సేవలు మరువ రానివని బీజేపీ మండల అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం వాజపేయి జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి సడక్ యోజన ద్వారా ప్రతి గ్రామానికి తారు రోడ్లతోపాటు స్వర్ణ చతుర్భుజి పేరుతో దేశంలో హైవేలను ప్రారంభించిన ఘనత వాజపేయికే దక్కుతుందన్నారు. అదే ఒరవడిలో ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో దేశ అభివృద్ధిని 11వ స్థానం నుంచి ఐదో స్థానానికి తీసుకొచ్చారని కొనియాడారు.నాయకులు పైలా అమ్మాజీ, శరగడం సన్యాసినాయుడు, జనపరెడ్డి సూర్యనారాయణ, సూరిశెట్టి ఎరుకునాయుడు, కూండ్రపు గంగునాయుడు, ఇమంది సన్యాసిరావు, సింగంపల్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

రావికమతం: ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచిన మహోన్నతవ్యక్తి మాజీ ప్రధాని, భారత రత్న వాజపేయి అని బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరావు అన్నారు. వాజపేయి జయంతిని గుడిప గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడు అడ్డూరి ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజేశ్వరావు వాజపేయి చిత్ర పటానికి పూలమాళలతో ఘన నివాళలర్పించారు. అనంతరం గ్రామంలో స్వీట్లు పంచారు.ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ కార్యదర్శులు కె.చినబ్బాయి, రాము, జి.శంకర్, శ్రీను, వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: మండల కేంద్రంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆడారి గణేశ్వరరావు, పచ్చిగోళ్ల ఈశ్వరరావు, మడ్డు నారాయణరావు తదితరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దేశ ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన వాజపేయి కృషి ఆదర్శప్రాయమన్నారు.

చీడికాడ: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీ సుకువెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొనగంటి అప్పారావు కోరారు. మండలంలోని జి.కొత్తపల్లి ఆశ్రమం ఆవరణలో బుధవారం పార్టీ కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల కేం ద్రం విడుదల చేస్తున్న నిధులతో గ్రామాలను అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా బాలకృష్ణ

అనంతరం బీజేపీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షునిగా పాతాళం బాలకృష్ణ (తునివలస), ప్రధాన కార్యదర్శిగా పల్లి అప్పలనాయుడు (చీడికాడ)లతోపాటు మరో 9మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టా ప్రసాద్, మాడుగుల నియోజకవర్గ కన్వీనర్ మేడపురెడ్డి శ్రీనివాస్, నాయకులు పుట్టా మల్లికార్జునరావు చెరువూరి శివాజీరాజు, రెడ్డి కొండబాబు, పరవాడ మురళీ, మాజీ సర్పంచ్ చొక్కాకుల కోటి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగులలో మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజపేయి జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోడా వెంకటేశ్వరరావు, సాయిరాం, పుట్టా నానాజీ, లెక్కల కాశిబాబు, రొబ్బా మహేష్, మండల సతీష్, వాసు తదితరులు పాల్గొన్నారు.


మాడుగులలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


బాలకృష్ణకు నియామకపత్రమిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు అప్పారావు

ధ్వజ స్తంభం ప్రతిష్ఠ


వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన ధ్వజ స్తంభం

మాడుగుల డిసెంబర్ 25, (ఆంధ్రజ్యోతి): స్థానిక అతి పురాతనమైన వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం ధ్వజ స్తంభం ప్రతిష్ఠంప చేశారు. 400 కిలోల ఇత్తడిని గ్రామంలో భక్తుల నుంచి సేకరించి ఈ ధ్వజ స్తంభం నిర్మించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జోరు వాన


మాడుగులలో కురుస్తున్న వర్షం

మాడుగుల డిసెంబర్ 25, (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మాడుగుల కేంద్రంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా జోరువాన కురిసింది. దీంతో ప్రజలు, వివిధ పనులకు వెళ్లేవారు సైతం ఇళ్లకు పరిమితం అయ్యారు. రైతులు వరి చేను తడిసిపోవడంతో లబోదిబో మంటున్నారు. వర్షంతో పాటు చలి తీవ్రత అధికంగా ఉండటంతో చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు.